క్లుప్తంగా

మెగా రక్తదాన శిబిరం



లోవకొత్తూరులో రక్తదానం చేస్తున్న యువకులు

తుని రూరల్: మండలంలోని లోవకొత్తూరులో హెల్ప్ గ్రూప్ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. హెల్ప్ గ్రూప్ సభ్యుడు ఓంకార్ పెళ్లిరోజు సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో 25 మంది యువకులు రక్తదానం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యంగా హెల్ప్‌గ్రూప్ పని చేస్తోందని ఫౌండర్ కాళ్ల రాజేష్ తెలిపారు. రక్తదానం చేసిన యువకులకు ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్, ఎమర్జన్సీ బ్లెడ్ సర్వీసు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



లింగంపర్తిలో అమ్మవారికి సారె సమర్పించిన దాతలు

ఏలేశ్వరం: లింగంపర్తిలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ అర్చకుడు వంకాయలపాటి సాయి ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ దాతలు వూర నాగవెంకట్రావు, వెంకటలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి సారె సమర్పించారు. చీర, పసుపు కుంకుమ, గాజులు, పిండివంటలు నైవేద్యంగా పెట్టారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హంసవరంలో 'ఫ్యామిలీ డాక్టర్'



హంసవరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామానాయుడు

తుని రూరల్: మండలంలోని హంసవరంలో శుక్రవారం సర్పంచ్ రాయి మేరీ అవినాష్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ డాక్టర్ రామానాయుడు 158 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మేరీ అవినాష్ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సునీత, డీఈఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై అవగాహన



అప్పనపాలెంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్ఓ వెంకట్రావు

ఏలేశ్వరం: మండలంలోని మల్లవరం అటవీ సెక్షన్ పరిధిలోని అప్పనపాలెంలో ప్రజలకు శుక్రవారం వన్యప్రాణి సంరక్షణ చట్టాలపై ఎఫ్ఎస్ఓ ఎం.వెంకట్రావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి, దానిలో నివసించే జీవులను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. అడవి నుంచి బయటకు వచ్చే జంతువులు తిరిగి అడవిలోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలా చెయ్యకుండా వాటిని వేటాడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అల్లిపూడిలో గడప గడపకూ...

కోటనందూరు: మండలంలోని అల్లిపూడిలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీపీ లగుడు శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓటర్ల సర్వే పరిశీలన


రౌతులపూడి: గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల సర్వేను బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. పలు గ్రామాల్లో బీఎల్‌ఓలు చేస్తున్న సర్వేను పరిశీలించారు. తొలుత తహసీల్దారు భీమారావును కలిసి మండలంలోని పోలింగ్ కేంద్రాల సంఖ్య, వాటి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం గ్రామ సచివాలయాలకు వెళ్లి బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఓటు నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, ఓట్ల తొలగింపు తదితర అంశాలపై ఆరా తీశారు. పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

స్వగృహమస్తు

- జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్ల నిర్మాణం
- ఒకే చోట 4715 మందికి స్థలాలు
- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తుని పట్టణంలో వివరాలు

మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు	4715
మంజూరైన గృహాలు	4515
ఇళ్ల నిర్మాణం చేపట్టినవి	1680
పూర్తయిన ఇళ్లు	60
శ్లాబ్ దశలో ఉన్నవి	120
వివిధ దశల్లో ఉన్నవి	2835



తుని జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు

తుని: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. గతంలో పూరి గుడిసెలు, అద్దె ఇళ్లలో గడిపిన అక్కచెల్లెమ్మలు ప్రస్తుతం సొంతిట్లో హాయిగా గడుపుతున్నారు. తమ ఏళ్ల నాటి కల సాకారం కావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి పట్టణంలోని పేదలకు ఉప్పరగూడెంలో 1154 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. అందులో ఇళ్ల నిర్మాణాలు చేసి నివాసం ఉంటున్నారు. ఆ తర్వాత వచ్చిన టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్కరికి ఇళ్ల స్థలం ఇచ్చిన దాఖలాలు లేవు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మిస్తున్నారు.

రాజుపేట సమీపంలో...

తుని పట్టణ పరిధిలోని 30 వార్డులకు చెందిన 4715 మందికి తుని మండలం రాజుపేట సమీపంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. వీరిలో 4515 మందికి ప్రభుత్వం గృహాలను మంజూరు చేసింది. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇనుము, సిమెంట్, ఇసుకను అందించారు. పనులు ఆలస్యంగా మొదలైనా నిర్మాణాలు చకచక జరుగుతున్నాయి. 1680 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టారు. వీరిలో 60 మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేశారు. శ్లాబు దశలో 120, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. పురపాలక, గృహ నిర్మాణశాఖ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

మౌలిక వసతులు కల్పన

రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా టౌన్‌షిప్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మౌలిక వసతుల కల్పన విషయంలో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు జగనన్న కాలనీలో విద్యుత్, బోర్లు, రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చూడడంతో ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా జరుగుతున్నాయి.



నిర్మాణం పూర్తయిన ఇల్లు

రెండు నెలల్లో గృహ ప్రవేశం



పిల్లల చదువులు, అద్దె ఇంట్లో కాపురం ఇలా నెలకు వచ్చే సంపాదన కుటుంబ ఖర్చులకే సరిపోవడంతో సొంతిల్లు కట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉచితంగా ఇళ్ల పట్టాలు ఇస్తామని మా వలంటీర్ చెప్పాడు. నేను దరఖాస్తు చేశాను. సచివాలయం నుంచి మీకు ఇళ్ల స్థలం మంజూరు చేశారని చెప్పడంతో నా ఆనందానికి అవధుల్లేవు. అనుకున్నట్టే ఇంటి స్థలం మంజూరుతో పాటు ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఇనుము, సిమెంట్, ఇసుక తక్కువ ధరకు ఇచ్చారు. మా ఇంటి నిర్మాణ పనులు వేగంగా జరుతున్నాయి. రెండు నెలల్లో గృహ ప్రవేశం చేస్తాం.

–ఎంఎస్ వెంకట రమణమ్మ, రైల్ నగర్, తుని

పేదల జీవితాల్లో వెలుగులు



మాది పేద కుటుంబం. పనికి వెళితేనే గాని పూట గడవదు. పిల్లల చదువులకు అమ్మఒడి ఇస్తున్నారు. సగం భారం తగ్గింది. అభివృద్ధి చెందిన తుని పట్టణంలో ఇళ్లు కట్టుకోవాలంటే సామాన్యులకు సాధ్యం కాదు. ఇళ్ల స్థలానికే రూ.లక్షల్లో వెచ్చించాలి. మాలాంటి పేదలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇనుము, ఇసుకను అందించారు. మా ఇంటి నిర్మాణానికి ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహకరిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల జీవితాల్లో వెలుగులు నింపారు.

–కర్రి లక్ష్మి, బాలాజీ రోడ్డు, తుని

పట్టా ఇచ్చారు.. ఇల్లు కట్టిస్తున్నారు



ప్రజలకు ఏమి కావాలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తెలుసు. ప్రజా సంకల్పయాత్రలో ఆయన దగ్గరగా ప్రజల సమస్యలను చూశారు. అధికారంలోకి పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలోనూ ఇదే హామీని ఇచ్చారు. కాని హామీ ఇచ్చిన నాయకులు ముఖం చాటేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దరఖాస్తు చేసిన అతి తక్కువ సమయంలోనే లబ్ధిదారులను ఎంపిక చేశారు. వార్డు వలంటీర్ ద్వారా ఇళ్ల స్థలం వచ్చిందని చెప్పారు. అధికారులు దగ్గరుండి తీసుకువెళ్లి మంత్రి రాజా చేతుల మీదుగా ఇంటి పట్టా ఇచ్చారు. ప్రస్తుతం మా ఇల్లు నిర్మాణంలో ఉంది. త్వరలోనే గృహ ప్రవేశం చేస్తాం.

–కె.వరలక్ష్మి, అమ్మాజీపేట, తుని

రేపు గుమ్మళ్లదొడ్డిలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో ప్రసిద్ధిగాంచిన శ్రీరామగిరి కొండపై ఆదివారం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ అర్చకులు శుక్రవారం తెలిపారు. అన్నవరం దేవస్థానం ధర్మప్రచార మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 9 గంటలకు ఈ వ్రతాలు నిర్వహిస్తారన్నారు. వ్రతంలో పాల్గొనే వారికి పూజా సామగ్రి, స్వామి వారి వెండి ప్రతిమ, అన్నవరం ప్రసాదం ఉచితంగా అందిస్తారన్నారు. వ్రతాలు ఆచరించే భక్తులు ముందుగా ఆలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు



టీడీపీ నేతలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు

తొండంగి: రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడుపై వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ప్రతినిధులు శుక్రవారం ఒంటిమామిడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బహిరంగ సభల్లో ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, వీరిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిట్ ఇండియాతో సంపూర్ణ ఆరోగ్యం



కొత్తపల్లిలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

గోకవరం: మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి సీహెచ్‌ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు అన్నారు. కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో శుక్రవారం వైద్య సిబ్బంది ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేశారు. యోగా సాధన చేస్తూ ఆరోగ్యం కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌ఓ పి.శ్రావ్య, హెచ్‌వి అరుణోనమ్మ, హెల్త్ అసిస్టెంట్లు పవన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా రాజు



గాబు రాజు

తొండంగి: వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తొండంగికి చెందిన గాబు రాజు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయని గాబు రాజు తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆశీస్సులతో ఈ గుర్తింపు లభించిందన్నారు. ఇదే స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం గంగబాబు, జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, ఎంపీపీ దడాల స్వర్ణలత, ఎంపీటీసీలు, సర్పంచులు అభినందనలు తెలిపారు.

పనులు వేగవంతం చేయాలి

ప్రత్తిపాడు రూరల్: జగనన్న మా భూమి–మా హక్కు (స్వామిత్వ) పనులను వేగవతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ అధికారులను ఆదేశించారు. స్వామిత్వ పథకానికి ఎంపికైన మండలంలోని ఇ.గోకవరం, బావురువాక, బాపన్నదార, వంతాడ, తాడువాయి, తోటపల్లి, బురదకోట గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పలు సూచనలు చేశారు. జగనన్న మా భూమి మా హక్కు కార్యక్రమంలో భాగంగా సమగ్ర సర్వే చేపట్టి ఇళ్ల స్థలాలకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కాశీ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శులు ద్వీబాష్యం శ్రీనివాసరావు, బి.వీరబాబు, ఎం.లక్ష్మీనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి వనదుర్గ అమ్మవారి జాతర



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర శ్రావణ శుద్ధ దశమి శనివారం నుంచి ఈ నెల 31 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. తొలి రోజు అమ్మవారిని 'బాలాత్రిపురసుందరీదేవి'గా అలంకరించి పండితులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ విధంగా ఈ నెల 31 పౌర్ణిమ వరకూ రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు వనదుర్గ అమ్మవారి ఆలయంలో పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం నిర్వహించి జాతర మహోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. నవధాన్యాలతో మండపారాధన, కలశస్థాపన చేస్తారు. 50 మంది రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, చిట్టింవాసు, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. రత్నగిరి పై రూ.2 కోట్లతో డార్మెట్రీ నిర్మిస్తున్న దాత పెన్నాడ రాజామణి, ఆర్యవైశ్య సత్రం అధ్యక్షుడు పేరూరి గాంధీ, వ్యాపారవేత్త వీర్ల సూరిబాబుతో పాటు మరో 15 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

సత్యదేవుని ఆలయంలో దేవేరి అనంతలక్ష్మీసత్యవతేదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో రుత్విక్కులు రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి



బదిలీ అయిన ప్రత్తిపాడు సీఐ కిషోర్‌బాబును సత్కరిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

ప్రత్తిపాడు: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తే ప్రజలు ఆదరిస్తారని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి అన్నారు. ప్రత్తిపాడు సీఐ కె.కిషోర్‌బాబు కాకినాడ జిల్లా పోలీస్ ట్రెనింగ్ సెంటర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక సరయూ ఫంక్షన్ హాలులో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి మాట్లాడుతూ నిబద్ధతతో విధులు నిర్వర్తించిన సీఐ కిషోర్‌బాబు సేవలను కొనియాడారు. అనంతరం డీఎస్పీ లతాకుమారి, ప్రస్తుత సీఐ ఎం.శేఖర్‌బాబు, ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ తదితరులు కిషోర్‌బాబును గజమాల, శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం, ఏలేశ్వరం, రౌతులపూడి ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..!

- భక్తిశ్రద్ధలతో వ్రతమాచరించిన మహిళలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



గోపాలపట్నం నేరేళ్లమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



గాజుల అలంకరణలో సీతంపేట మీనాక్షి కనకదుర్గమ్మ అమ్మవారు



తుని చిట్టూరి మెట్రోలో శుభంకరిగా దర్శనమిస్తున్న వరమహాలక్ష్మి



గోకవరంలో వెండి, బంగారు ఆభరణాలతో వరలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ

ఏలేశ్వరం: వరలక్ష్మీదేవి వ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు ఉదయాన్నే తలస్నానం చేసి నూతన వస్త్రాలు ధరించి వరలక్ష్మీదేవి అమ్మవారి చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రకాల పిండి వంటలతో చీర రవికె, బంగారం రూపు అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ముత్తయిదువులకు వాయానాలు ఇచ్చారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, నర్సీపట్నం రోడ్డు, తోటవీధి, దిబ్బలపాలెం, తదితర ప్రాంతాల్లోని దుర్గమ్మ ఆలయాల్లో భక్తులు సామూహిక పూజలు నిర్వహించారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి, సీతంపేట, శంఖవరం గ్రామాల్లోని కనకదుర్గమ్మ ఆలయాలకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు అమ్మవారిని పట్టు వస్త్రాలు, గాజులతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సర్వశుభంకరిలక్ష్మిగా వరమహాలక్ష్మి

తుని: స్థానిక చిట్టూరి మెట్రోలో వేంచేసిన వరమహాలక్ష్మి అమ్మవారు శుక్రవారం సర్వసుభంకరి లక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసంలో రెండో శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా వేద పండితులు అమ్మవారిని పసుపు రంగు పుష్పాలు, వస్త్రాలు, పసుపు కొమ్ములతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, కుంకుమార్చన సాయంత్రం నిత్య అర్చన, దశవిధ హారతులు, పవళింపు సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వరలక్ష్మీదేవిగా దేవీచౌక్ కనకదుర్గమ్మ

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయంలో కొలువైన కనకదుర్గమ్మ శుక్రవారం వరలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పవిత్ర శ్రావణ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతాన్ని పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారిని అర్చకులు వల్లూరి జగన్నాథ శర్మ, శ్రీనివాస్‌శర్మ వెండి, బంగారు ఆభరణాలతో అలంకరించారు. ఆలయాన్ని పూలతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. స్థానిక వీరభద్రునిగడ్డలోని కనకదుర్గమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీవ్రతాలు నిర్వహించారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, పెద్దిపాలెం, ఒమ్మంగి, ఉత్తరకంచి, పోతులూరు, చింతలూరు, వాకపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పెద్దిపాలెం నూకాలమ్మ ఆలయంలో పండితులు చీకట్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు భారీ ఎత్తున పాల్గొని వరలక్ష్మీవ్రతాలు ఆచరించారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

ప్రత్తిపాడు: స్థానిక అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి పంచాయతన క్షేత్రం, దుర్గాదేవి ఆలయం, బైపాస్ రోడ్డులోని దుర్గమ్మ అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ తదితర గ్రామాల్లోని దుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినులు సామూహిక వరలక్ష్మీ పూజలు నిర్వహించారు.

రౌతులపూడి: శ్రావణ మాసంలో రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీదేవి వ్రతాన్ని భక్తిశద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పండితులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కిర్లంపూడి: శ్రావణమాసంలో రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జగపతినగరంలోని అభయ దుర్గమ్మ, ఏనుగువీధి సెంటర్‌లో వేంచేసిన వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

జగ్గంపేట: వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం జై.కొత్తూరు గ్రామ దేవత కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మడగల పెద్దకాపు, సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరరావు, మోటూరు వెంకటరమణ పాల్గొన్నారు.

సాముహిక వరలక్ష్మీ వ్రతాలు

తొండంగి: మండలంలోని పలు ఆలయాల్లో శుక్రవారం సాముహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయంలో పరిసర గ్రామాలకు చెందిన మహిళలు సాముహిక వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలు నిర్వహించారు. శృంగవృక్షం, ఒంటిమామిడి, వేమవరం, పి.ఇ.చిన్నాయపాలెం, ఎ.కొత్తపల్లి, తొండంగి తదితర గ్రామాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు.



ప్రత్తిపాడు ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో వరలక్ష్మీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థినులు



ప్రత్యేక అలంకరణలో జగపతినగరం అభయ దుర్గమ్మ అమ్మవారు